కథానిక:

# ★ క్రిందిబెర్తు ★

రచన: 'రాధిక'

**పెళ్ళంటే బొమ్మలాటకాదు. పెళ్ళి చేసుకునేటప్పుడు ఈ విషయం జ్ఞాపకం ఉంచుకోండి. యిక మీరు వెళ్ళవచ్చు" గంభీరమైన కంఠంతో ఈ మాటలనేసి లోపలికి వెళ్ళిపోయింది శారద—— పెళ్ళిచూపులకు వచ్చినవారిని యిల్లా ఎందుకన్నదో ?**

"అబ్బ ! యింత ఉక్కగా ఉందేమిటి ?" అనుకున్నాడు ప్రసాదరావు షర్టు గుండీలు విప్పివేసుకుంటూ. చేతిలో ఉన్న పేపరును మడిచి ప్రక్కనపడేసి బెడ్ మీదినుంచి లేవకుండానే ఎడమవైపుకు తిరిగి నిటారుగా ఉండి తిరుగుతూన్న ఫానును తనవేపు తిప్పుకోబోతూ యథాలాపంగా క్రిందనున్న ఎదుటి బెర్తుకేసి చూశాడు. అతని చూపులు కొన్ని నిముషాలపాటు ఆ బెర్తుకేసే నిలిచిపోయాయి. కారణం ఎదటి బెర్తులోఉన్న ఏదో విశేషము అతన్నాకర్షించడంకాదు. బెర్తుకు ఆ చివర కిటికీదగ్గర ఏదో పత్రిక తిరగవేస్తూ కూర్చుని ఉన్న ఒక పడతిలో అతనికేదో విశేషము కన్పించింది.

"ఈ అమ్మాయినీ... ఈ అమ్మాయినీ... ఎక్కడో చూసినట్లు గుర్తు" అనుకున్నాడు తనలో తాను పైకి విన్పించకుండా.

ఫాను తనవేపు తిప్పుకుంటూ "ఎక్కడ చూసానబ్బా !" అనుకున్నాడు.

వెల్లకిలా తిరుగుతూ 'అవును, గొట్టిపాడులో కదూ!' అనుకున్నాడు. 'అయితే ఈ అమ్మాయికి పెళ్ళయిందీ ? తనను తానే ప్రశ్నించుకున్నాడు. సమాధానికై మళ్ళీ ఎడమవేపుకు తిరిగి క్రింది బెర్తుకేసి చూశాడు. తన దృష్టిని మరికొంచెం క్రిందకిపోనిచ్చాడు. ఆశ్చర్యంతో అతనినోరు కొద్దిగా విచ్చుకుంది. ఆకుచెప్పులలోఉన్న ఆమె పాదాల వేళ్ళకున్న మట్టెలు ఆమె వివాహితేనని అతనికి తెలియజెప్పాయి.

"ఈమెకు పెళ్ళయిందా ? ఎలా ?" అసంభవమైన విషయమేదో జరిగినట్లు ఆశ్చర్యపడ్డాడు. అయిదు సంవత్సరాలక్రితం జరిగిన ఒక సంఘటన అతని మనసులో మెదిలింది.

◆ ◆

ఎం ఏ. చదువుదామనుకున్న ప్రసాదరావు ఆలోచన తండ్రికి నచ్చలేదు. 'ఏదో బి. ఎ. పాసయ్యావుకదా లక్షణంగా ఏదో ఒక ఉద్యోగం చూసుకుని పెళ్ళిచేసుకుని హాయిగా ఉండక పై చదువులంటావేమిటి ?' అన్నాడాయన. కాని ప్రసాదరావు పట్టిన పట్టు వదలలేదు.

"మరి పెళ్ళి ఈ ఏడాదికూడా వాయిదా వేద్దామనా నీ ఉద్దేశ్యం ?" తండ్రి వెంకట్రామయ్య అడిగినదానికి 'యిప్పుడప్పుడే చేసుకోవాలని లేదు నాన్నా !" అనేశాడు.

"ఆడపిల్లగలవాళ్ళు ఎంత కాలమని ఆగుతారు ?"

"ఆగమని మనమన్నామా ? వాళ్ళమ్మాయి పెళ్ళిచేసుకోమను"

ప్రసాదరావు మాటలు విని నిర్ఘాంతపోయాడు వెంకట్రామయ్య "ఏమిట్రా నువ్వనేది. రెండేళ్ళబట్టి ఖాయమయిందీ అనుకుంటున్న సంబంధం కదా. యిప్పుడిలా అనటం ఏమైనా బాగుంటుందా ?" అంతులేని కోపాన్ని అణచిపెట్టుకుంటూ గద్గదికమైన కంఠంతో అన్నాడాయన.

'ఎందుకు బాగుండదూ ? వాళ్ళకంటే ఎక్కువ కట్నమిచ్చేవాళ్ళుండగా వాళ్ళనే పట్టుకు వేలాడటం నీదే తప్పు. అయినా ఆ సంబంధం మొదటినుంచీ నాకిష్టంలేదు. అందుకనే ఆ పిల్లను చూడటానికైనా నేను రాలేదు."

'డబ్బు ముఖ్యమా! సంప్రదాయం, వంశప్రతిష్టా ముఖ్యమా ? పిల్లను చూడనవసరం లేదనీ, అంతా నాయిష్టమేననీ అప్పుడెందుకన్నావు ?"

'అయినా ఆ పిల్ల ఎలాంటిదనుకున్నావు? అప్సరసరా ? పోనీ ఒకసారి చూచిరా.

అంత అప్సరసా ? ఏమైనా...

మాట మధ్యలోనే అందుకుని 'నా మాట విని ఒక్కసారి చూచిరా సాక్షాత్తూ లక్ష్మీదేవిలాంటిపిల్లరా! అన్నాడు వెంకట్రామయ్య. పిల్లను చూస్తైనా పెళ్ళికి ఒప్పుకుంటాడని ఆయన నమ్మకం.

వెంకట్రామయ్యగారి భార్య ప్రసాదరావు అయిదేళ్ళ వయసప్పుడు గుండె జబ్బుతో హఠాత్తుగా చచ్చిపోయింది. నాటినుంచీ ఆ యింటికి సరైన ఆడదిక్కులేదు. బంధువులు యిరుగూ, పొరుగూ ఆడదక్షతలేని యిల్లు అడవితో సమానమనీ, మరో పెళ్ళిచేసుకోమనీ సలహా యిచ్చారు. చాలామంది తమపిల్లల నిస్తామంటూ బ్రతిమాలారుకూడా. కానీ భార్యను ప్రాణసమానంగా ప్రేమించిన వెంకట్రామయ్య ఆమె స్థానంలో మరొకరు రావడానికి వీల్లేదని ఖచ్చితంగా చెప్పేశాడు. అప్పటినుంచీ తల్లీ, తండ్రీ తానే అయి ప్రసాదరావును పెంచి పెద్ద చేసాడు.

రెండేళ్ళక్రితం ప్రసాదరావు యింటర్మీడియేట్ చదువుతూండగా గొట్టిపాడులోఉన్న రామయ్యగారి సంబంధం వచ్చింది. ఆయన కూతురు శారద అన్ని విధాలుగా తన కోడలుగా వెంకట్రామయ్యగారికి నచ్చింది. ప్రసాదరావుకూడావచ్చి పెళ్ళికూతుర్ని చూసుకోమంటే తండ్రికి యిష్టమయితే తనకూ యిష్టమేననీ కాని పెళ్ళిమాత్రం బి. ఏ., పాసయ్యాక చేసుకుంటాననీ అన్నాడు. కొడుకు తన మాట జవదాటడన్న నమ్మకంతో శారదకు

(తరువాయి 19 వ పేజీ)

★ క్రిందిబెర్తు ★

(14 వ పేజీ తరువాయి)

పసుపూ, కుంకుమపెట్టి పిల్లను తమదనిపించుకున్నాడు.

ఈ రెండేళ్ళలోనూ ప్రసాదరావు మనస్తత్వం చాలామారిపోయింది. తండ్రిమాట వేద వాక్యంగా భావించి ఆచరించటంనుంచి వెంకట్రామయ్యగారి మాటకు ఎదురు చెప్పడం కూడా నేర్చుకున్నాడు. తండ్రి భావాలూ, ఆయన ఉద్దేశ్యాలూ పాతకాలంనాటివనీ, ఈ కాలానికి అవి తగవనీ నిర్ధారణచేసుకుని మెల్ల మెల్లగా ఆయన మాటలను ఖండించడం మొదలెట్టాడు. ఎదిగొచ్చిన కొడుకుమాటను కాదన లేక తనే సర్దుకునిపోవటం అలవాటు చేసుకున్నాడు వెంకట్రామయ్య. అందువలననే ప్రతిసెలవులలోనూ కొడుకుపెళ్ళి చేద్దామన్న తన ఉద్దేశ్యాన్ని కొడుకు 'యిప్పుడే వద్దు' అనగానే మార్చుకుంటూ వస్తున్నాడు.

తీరా బి. ఎ, పాసయ్యాక కొడుకుచెప్పిన సమాధానం వినేటప్పటికి వెంకట్రామయ్య గుండె ఆగినంత పనయింది. ప్రసాదరావు యిలా అంటాడని ఆయన కలలో కూడా అనుకోలేదు. 'కట్నం' పేరు కొడుకు నోటి వెంట వస్తుందనీ, తనకంటే విద్యావంతుడైన తన కొడుకు యింత సంకుచితమైన మనసు కలిగి ఉంటాడనీ ఊహించుకోలేదు కూడా.

ఆడపిల్లను, పసుపూ, కుంకుమ పెట్టి, రెండేళ్లు అట్టేపెట్టి చివరకు 'మీ పిల్ల పెళ్ళి చేసేసుకోండి' అనడంతో ఎంత అన్యాయం, ఎంత అవమానం, ఎంత అప్రతిష్ట ఉన్నదో తలచుకుంటుంటే వెంకట్రామయ్య ఒళ్ళు జలదరించిపోయింది. ఆయన మనసులో రేగిన కల్లోలం ఎంత భయంకరమైందో నవనాగరికతకు చిహ్నంగా బి. ఏ., పట్టా పుచ్చుకోబోతున్న ప్రసాదరావుకేమీ తెలియలేదు. అతని మనసు మద్రాసులో తనకు పిల్లనిస్తా నన్న లక్షాధికారిమీదా, తను పుచ్చుకోబోయే ఎం ఎ., డిగ్రీపైనా, ఆ లక్షాధికారికూతురైన ఉమాకుమారి మీదా మోజుతో నిండిపోయింది. ఆ మోజులో అతనికి తండ్రి మమతగానీ, శారద తలిదండ్రుల కలతగానీ శారద నిస్సహాయతగానీ ఏదీ అతనికి కన్పించలేదు మానసికంగా అంధుడైపోయాడు ప్రసాదరావు.

తండ్రి శతవిధాలపోరగా శారదను చూచి రావడానికై బయలుదేరాడు ప్రసాదరావు. ఊరికే చూసి వచ్చేసి నచ్చలేదని చెప్పేస్తే పెదద తీరిపోతుందని అతని ఉద్దేశ్యం. పిల్లను చూస్తే కొడుకు నిరాకరించలేడని వెంకట్రామయ్యగారి గట్టి నమ్మకం. ఆ నమ్మకమే లేకపోతే ఆయన ప్రసాదరావును శారదను చూడడానికై పంపించేవాడు కాడేమో.

రామయ్యగారి పాలేరు వెంటరాగా కాలి నడకనే నడుస్తూ కేవలం మనిషి అడుగుజాడల లోనే ఏర్పడిన ఆబాటను అసహ్యించుకుంటూ విధిలేక తప్పనిసరిగా వస్తున్నట్లు పాలేరుతోనే చెబుతూ రామయ్యగారి యింటికి చేరేటప్పటికి తలప్రాణం తోకకువచ్చింది ప్రసాదరావుకు.

అతనిని బయటనే నిలబెట్టి పాలేరు యింట్లోకివెళ్ళి అతని రాకను యింట్లోవారి కెరిగించాడు. అందాలరాశి అయిన ఒక అమ్మాయి చెంబుతో నీళ్ళు తీసుకొచ్చి అతని కందించి "యింట్లోకి రండి" అని ఆహ్వానించింది. ఆమె అందాన్ని చూసి 'పల్లెటూళ్లో నిజంగా అప్సరసలే ఉన్నారులా ఉందే' అని అనుకున్నాడు మనసులో ప్రసాదరావు కాళ్లు కడుక్కొని యింట్లోకి వెళ్ళిన అతన్ని చావడిలో వేసిన కుర్చీలలో ఒకదానిని చూపించి కూర్చోమని చెప్పింది. ఎదురుగాఉన్న మరో కుర్చీలో తను కూర్చుని అతనివేపు పరకాయించి చూసింది.

ఇదంతా గమనిస్తున్న ప్రసాదరావుకేమీ అర్థంకాలేదు. తనను పరకాయించి చూస్తున్న ఆ అమ్మాయి చూపుకి తట్టుకోడానికి ప్రయత్నిస్తూ 'నేను మళ్ళీ తిరుగుబస్సుకు వెళ్ళిపోవాలి' అన్నాడు

'అలాగా, అయితే మీరిక్కడికెందుకు వచ్చినట్టు?' అని అడిగిందా అమ్మాయి నిబ్బరంగా.

షాక్ తిన్నట్లుగా ఫీలయ్యాడు ప్రసాదరావు రెండు నిముషాలసేపు ఏమీ మాట్లాడలేక పోయాడు.

తర్వాత గొంతు సవరించుకుని 'రామయ్యగారు రమ్మంటే వచ్చాను.' అన్నాడు.

'ఓహో! రామయ్యగారు రమ్మన్నారా మిమ్మల్ని? ఉండండి కాఫీ తీసుకొస్తాను. అంటూ కుర్చీలోనుంచి లేచి యింట్లోకి వెళ్ళింది.

ఆమె యింట్లోకి వెళ్ళగానే వీధినాకిట్లో నుంచి తనను గొట్టిపాడు వెంటబెట్టుకు వచ్చిన పాలేరు వచ్చి 'అయితె అమ్మగారు మిమ్మల్నెందుకు రమ్మన్నారో చెబుతారా?' అని అడిగాడు నిలదీసి అడుగుతున్నట్లుగా.

యిందాక అమ్మాయి 'యిక్కడికెందుకొచ్చినట్లు?' అని అడిగినపుడు ఎంత యిరకాటంలో పడ్డాడో అంతకంటే రెట్టింపు యిరకాటంలో పడిపోయి ఏమీ మాట్లాడకుండా తలవంచేసుకున్నాడు. అతని వీపుమీద ఛెళ్ళున పడుతున్న కొరడాలాగా అన్పించసాగింది, 'యిక్కడికెందుకొచ్చినట్లు?' అన్న మాట. అంతా తెలిసివుండీకూడా వీళ్ళంతా ఎందుకిలా అడుగుతున్నారో అతనికి అర్థం కాలేదు.

'ఏందయ్యా! మాటాడవేం? నువ్వు సెప్పకపోయినా పాలిగాడు గంగన్న నాకు నీ విసయమంతా సెప్పిండులే. యింత సదువూ సదివావుగందా? ఎందుకయ్యా నీ సదువు? తగుదునమ్మా అని టీకు టాకుగా సక్కా వచ్చినవు. ఏం! పారుగోళ్ళు ఆడపిల్లలంత అలుసుగా ఉండారా నీకు? ఏంది కొట్యాల్లే కురిసీకింటుకుని మాటాడేవు?' పాలేరు పచాయించి అడుగుతూంటే గుండెలవిసిపోయి నట్లనిపించాయి ప్రసాదరావుకు.

యింతలో కాఫీ ట్రే పట్టుకొని యిందాకటి అమ్మాయి లోపలినుంచి వస్తూ 'ఏమిటి సుబ్బన్నా? ఏదో హడావిడి చేస్తున్నట్లున్నావ్. అంతదూరంనుంచి కష్టపడివచ్చిన

...య్యగార్ని కాఫీకూడా త్రాగనీయవా?' అన్నది నవ్వుతూ.

'ఈ అయ్యగారికింకా కాఫీగూడా దేనికండి శారదమ్మగారూ! ఆ చెప్పాల్సిన బుద్ధేదో చెప్పేసి తొరగా పంపెయ్యక మళ్లీ అయ్యగారు వచ్చిండంటే ఈయన్ని నిలువునా పాతేత్తుడు ఆయనన్న కోపంలో' వెకిలిగా నవ్వుతున్న పాలేరు మాటలతో అవమానంతో కుంచించుకుపోతూ కుర్చీలోంచి లేచి వెళ్లిపోబోతున్న ప్రసాదరావు 'ఆగండి!' అన్న శారద గర్జన విని ఆగకూడదనుకుంటూనే కాళ్ళకెవరో సంకెళ్లు వేసినట్లు ఆగిపోయాడు.

'ప్రసాదరావుగారూ? యిలాంటి పిచ్చి పనులు మరెప్పుడూ చేయకండి. ప్రస్తుతం యింతకంటే నేనేమీ చెప్పలేకుండా ఉన్నాను పెళ్ళంటే బొమ్మలాటకాదు. పెళ్లిచేసుకునేప్పుడు ఈ విషయం జ్ఞాపకం ఉంచుకోండి యిక మీరు వెళ్ళొచ్చు' గంభీరమైన కంఠంతో ఈ మాటలనేసి లోపలికెళ్లిపోయింది శారద.

'యిక దయచేయండయ్యగారూ! దయచేయండి' అన్న పాలేరు సుబ్బన్న హేళనకుతో తడబడుతున్న కాళ్ళతో ఆయింట్లోంచి బయటపడి మళ్ళీ కాలిబాట పట్టుకుని నడుస్తూ తనకు జరిగిన పరాభవాన్నీ, పరాజయాన్నీ పదే పదే తలుచుకుంటూ తననింతగా అవమానించిన ఆ శారద'పై ఎలాగైనా కక్షతీర్చుకోవాలని నిశ్చయించుకున్నాడు స్వార్థమే తప్ప పరమార్థమే ఎరుగని ప్రసాదరావు (శారదకు జరిగిన అవమానంముందు తన అవమానం ఏ పాటిదో అతనికిప్పటికీ తెలియదు.)

ప్రసాదరావు ప్రతీకారం విషయమై ఆలోచించకుండానే శారదకు ప్రతీకారం జరిగిపోయింది రెండేళ్ళు ఒకరి పిల్లగా, ఒక యువకుని వధువుగా నలుగురిలో చలామణీ కావల్సిన శారదమీద తన కరువు తీరా నీలాపనిందలువేసి వెక్కిరించింది లోకం. ఈ కాకిలోకంనుంచి తప్పుకోవడానికై గుంటూరు వచ్చేసి కాలేజీలో పి. యు సి లో జాయిన యింది ఆమె పెళ్లి దిగులుతో మంచమెక్కిన రామయ్యగారు ఆరు నెలలు తిరక్కుండానే చనిపోయారు. శారద తల్లికి పూర్తిగా మతిపోయింది. శారద జీవితగతిని మనసారా ఆనందిస్తున్న ప్రసాదరావుకు అదంతా తమవల్లనే జరిగిందనీ, ఆ పాపమంతా తనదేనని వాపోతూ వ్యధతో క్రుంగిపోతున్న తండ్రి కేవలం మతిపోయినవాడిలాగే కనిపించాడు 'మరి జీవితంలో శారదకు పెళ్లి కాదు? అంతే కావాలి!' అనుకున్నాడు మనస్సులో విలన్ నవ్వు నవ్వుకుంటూ.

♦ ♦

'ఈనాడు ప్రసాదరావు ఎం. ఎ గ్రాజుయేట్ ఆఫీసరు పైగా మామగారు తన పేర వ్రాసిన లక్షల ఆస్తికి అధికారి శారద తన్ను చూడలేదు కాబోలు. చూసినా తనను గురించిన వివరాలు ఆమెకేం తెలుస్తాయి' అనుకున్నాడు గతించిన సంఘటనను నెమరు వేసుకున్న తర్వాత.

"యింతకీ ఈమె భర్త ఎవరో! బహుశః ఏలోయర్ డివిజన్ క్లర్కో, ఏ సెకండరీ గ్రేడు టీచరో అయి ఉంటాడు శారద విషయం అతనికి పూర్తిగా తెలియలేదో లేక గత్యంతరం లేక ఎక్కడా గతిలేక ఈపిణ్ణి చేసుకున్నాడేమో. అంతే అయివుంటుంది. లేకపోతే చితికిపోయిన సంసారం, మతిలేని తల్లి, తండ్రిపోవటంతో ఉన్న కాస్త పొలం చూసేవాళ్ళెవరూ లేక వాళ్ళకు కష్టంలుండే పరిస్థితికూడా ఏర్పడింపటం. అంతకంటే గొప్పవాడెవడు చేసుకుని ఉంటాడులే ఈవిడగార్ని? అసలీవిడకు పెళ్లి కావడమే ఒక ఘనకార్యం జరగడం లాంటిది' యిలా అనుకుంటూ మరోసారి క్రింది బెర్తుమీదున్న శారదకేసి చూశాడు

నిరాడంబరమైన వేషంతో సాదా తెల్లటి నేత చీరలో ఉన్న శారదరూపం అతని ఊహను నమ్మకంగా మార్చింది.

అప్పట్లో నాన్నమాటవిని తను ఈశారదనే పెళ్లాడినట్లయితే తనూ ఏక్లర్కుగానో స్థిరపడి ఉండేవాడు. ఈ హోదా ఈ దర్జా ఈ సౌఖ్యం తనకు గగనకుసుమాలయిపోయేవి. తను చేసింది పిచ్చి పని అన్న శారద యిప్పుడు తనను చూసి గుర్తుపడితే, తన గురించి వివరాలన్నీ తెలుసుకుంటే పైకి కనబడనీయక పోయినా మనసులోనయినా తన దురదృష్టాన్ని నిందించుకుంటుంది. హుఁ అందని పండుకై ఆశించినట్లు తనే భర్తనయితే ఆమె జీవితం ఎంత వైభవంగా ఉండేదో ఊహించుకుంటుంది. ఈ సమయంలో ఉమ తనతో పాటు ఉంటే? ఉమ శారదకూ పరిచయమైతే? తన వివరాలన్నీ ఉమ ఆమెకి చెపితే? హుఁ! తనెక్కడ? శారదెక్కడ? ఆకాశంలో ఉన్న తను అధఃపాతాళంలో ఉన్న శారద! యిప్పుడే కాదు జీవితయానంలో ఎప్పటికైనా శారద క్రింది బెర్తుమీదే ఉంటుంది.' యిలా ఊహిస్తూంటే అతని మనసు కెంతో హాయిగా ఉన్నట్లనిపించింది. గతించిన సంఘటన స్మృతికి వచ్చి తనలో రేపిన అవమానాన్ని మీద చల్లని నీరు చల్లినట్లయింది. గర్వంగా కాలరు సర్దుకున్నాడు పడుకునే.

'యీవిడెక్కడ దిగుతుందో చూద్దాం' అన్న కుతూహలంతో బెడ్ మీదనుంచి సగం లేచి దిగబోతూండగా సీటు మీదనుంచి లేచి వెళ్ళిపోతున్న శారద కన్పించింది. హడావిడిగా క్రిందకు దిగేసి స్టేషనేమిటో చూడబోయిన ప్రసాదరావుకు చైతన్యమంతా తనలో నింపుకున్నట్లున్న విజయవాడ ప్లాట్ ఫాంగం కన్పించింది. 'ఊహాలలో తేలిపోతున్న తనకు బండి నాలుగు స్టేషన్లు దాటిన విషయంకూడా తెలియలేదన్నమాట' చిన్నగా నవ్వుకుని బెడ్డింగు అదరాబాదరా క్రిందకులాగి చుట్టేసి డోర్ వైపు త్వరత్వరగా నడిచాడు.

అతని కెదురువస్తున్న కూలీ ప్రక్కకు తిరిగి "అయ్యగారు ఆడెవరితోనో మాట్లాడుతుండారమ్మా! నన్ను సామానుదింపమన్నరు' అన్న మాటల్ని విని 'ఓహో! అమ్మగార్ని రిసీవ్ చేసుకోడానికి అయ్యగారు వచ్చారు కాబోలు అనుకుంటున్న ప్రసాదరావుకు నవ్వుతూ కంపార్ట్ మెంట్ దగ్గరకు వస్తున్న తనపై ఆఫీసరు మధుసూదనరావు కన్పించాడు.

'ఏం శారదా! కేంపు గడువు కట్టింపు చేశావే?' అంటూ శారదను పలకరించి 'శ్రీరాణీగారు వేంచేసేప్పటికి లైసెన్సు కూలీలంతా స్ట్రయికు చేశారు. పెట్టె బేడా నెత్తిన పెట్టుకుని వెళ్ళాల్సిందే స్టేషను బయటకు' అంటూ పెద్దగా నవ్వాడు డోరు కమ్మీ పట్టుకుని దాదాపు కొయ్యబారినట్లున్న ప్రసాదరావును చూసి—

(తరువాయి 26 వ పేజి)

## ★ క్రింది బెర్తు ★

(20 వ పేజీ తరువాయి)

'ఏమోయ్? ప్రసాదరావూ నువ్వూ ఈ ట్రయినుకే వచ్చావ్? దిగు దిగు. ఏమిటలా తెల్లబోయావ్? బండిలో వున్న వాడు మన సొంత కూలీలేవయ్యా కూలీలుతేరన్న భయమేం లేదులే' అన్నాడు.

యాంత్రికంగా ప్లాట్ ఫారంమీదకు దిగాడు ప్రసాదరావు. కొన్ని నిముషాల క్రితం శారద తనను గుర్తు పడితే బాగుండు ననుకున్న అతని మనసు యిప్పుడు శారద తనను గుర్తుపట్టకుండా ఉంటే బాగుండు ననుకున్నాడు.

'ఈవిడ మా మిసెస్. పేరు శారదాదేవి ఈయన నా అసిస్టెంటు ఆఫీసరు పేరు ప్రసాదరావు' అన్నాడు మధుసూదనరావు యిద్దరినీ పరస్పరం పరిచయం చేస్తూ.

నవ్వలేక నవ్వాడు ప్రసాదరావు.

'ఓహో' అన్నది శారద. ఆ ఓహో'లో వ్యంగం, అసహ్యం మిళితమై ఉన్నట్లనిపించింది. తన నీడ చూసి తానే జడుసుకుంటున్నట్లున్నది ప్రసాదరావు పరిస్థితి.

కూలీ సామాను దింపేవరకూ శారదా మధుసూదనరావుల సంభాషణను వింటూ పాసింజర్లవేపు చూస్తున్నట్లుగా మొహం అటువేపు తిప్పుకుని నిలబడ్డాడతను.

శారద పెట్టెను నెత్తిమీద పెట్టుకుని ప్రసాదరావు బెడ్డింగును చేత్తో పట్టుకున్నాడు కూలి. మరో చేత్తో శారద బేగ్ అందుకోబోతుండగా 'ఫరవాలేదు. దాన్ని మేము తీసుకొస్తాంలే పదవోయ్.' అన్నాడు మధుసూధనరావు. క్రిందఉన్న బేగ్‌ను అందుకోబోతున్న మధుసూదనరావును వారిస్తూ 'నే తెస్తాలెండి సార్' అన్నాడు ప్రసాదరావు లాంఛనప్రాయంగా. బండి దిగినప్పటినుంచీ తను మాట్లాడలేదన్న విషయం అప్పుడే గుర్తు రావటంతో.

'యిక్కడకూడా అసిస్టెంటువే నన్న మాట సరే, అలాగే పట్టుకో' అన్నాడు మధుసూదనరావు నిర్మలంగా నవ్వుతూ.

"శారద బేగ్ తను మోయాలా? ఏదో లాంఛనప్రాయంగా అంటే ఈయనిలా అంటున్నాడేమిటి?' అనుకున్నాడు తనలో. కానీ తీరా నోరు జారింతర్వాత యిప్పుడనుకుని ఏం లాభం?

బేగ్ పట్టుకుని మెల్లగా నడుస్తున్న మధుసూధనరావూ తన చేతిలో ఉన్న హాండ్ బేగ్ 'క్రింది బెర్తు ఎవరిదీ?' అంటూ ప్రశ్నిస్తున్నట్లు కన్పించింది. యిదీ అని చెప్పలేని భావమేదో అతనిలో మెదిలింది.

తలవంచుకుని నడుస్తున్న ప్రసాదరావు 'నేను నిజంగా పిచ్చివాణ్ణి' అని గొణుక్కోవడం ప్లాట్ ఫారం సందడిలో ఎవరికీ విన్పించలేదు.

## వివేకానందవాణి:

తన పూర్వులనుగురించి సిగ్గుపడడం మొదలుపెట్టిననాడు వినాశనం పొంది తీరుతాడు హైందవజాతిలో కనిష్ఠుడనైనా నా జాతిని గూర్చి, నా పూర్వులను గూర్చి నేను గర్విస్తున్నాను. నన్ను నేను హిందూవని చెప్పుకోవటానికి, హైందవ జాతికి చెందిన మీ కందరకూ అథమ సేవకుడనని చెప్పుకోవడానికి నాకెంతో గర్వం! ప్రపంచ మెన్నడూ ఎరుగని మహర్షుల సంతతికి చెందిన మీ దేశమే నా దేశమని చెప్పుకోవడానికి నే నెంతో గర్విస్తున్నాను.

— ఉత్తిష్ఠత, జాగ్రత నుండి


# శుభవార్త

డాక్టర్లకు సాధ్యముగాక వదలివేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును. కుష్ఠు, బొల్లి, కేన్సర్, క్షయ, పిచ్చి, నపుంసకత్వము, సంతానము లేనివారు గూడ శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు.

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్స వల్ల దేహములోవున్న వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును.

వివరములు కోరువారు పోస్టుఖర్చులకు ఒకరూపాయి పంపవలయును.

అడ్రసు:

శ్రీ యోగాశ్రమము

P. O. పెదవాల్తేరు

విశాఖపట్టణము — 3